# సింగిల్ పేజీ కథలు

## ఆసరా

"నా పేరు కామేశ్వరరావు. నేనో రిటైర్డ్ ఉద్యోగిని. ముప్పైతొమ్మిది సంవత్సరాలు రాష్ట్రప్రభుత్వానికి నా సేవలందించి పదిహేనేళ్ల క్రితం రిటైర్ అయ్యాను. నేనూ, నా భార్యా మీ వృద్ధాశ్రమంలో చేరాలనుకుంటున్నాం. ఓ ప్రముఖ తెలుగు దినపత్రికలో పడిన మీ ప్రకటన చూసి ఇక్కడికి వచ్చాను. మీ సంస్థ నియమాలూ నిబంధనలూ ఏమిటో చెప్పండి."

కామేశ్వరరావు ఓ సామాన్య మధ్యతరగతి కుటుంబీకుడు. తండ్రి కామేశ్వరరావుని స్కూల్ ఫైనల్ వరకు చదివించాడు. ఒకరోజు తండ్రి కామేశ్వరరావునుద్దేశించి "ఒరే కామేశం! నేను ఓ నాలుగో తరగతి ఉద్యోగస్తుడిగా వుంటూ నిన్ను ఇంత చదువు చదివించానంటే అది నాలాటివాడికి సాహసమేరా. నిన్ను పెద్ద చదువులు చదివించే ఆర్థిక స్థోమత నాకు లేదు. పెళ్లికి ఎదిగిన నీ ఇద్దరి అక్కల పెళ్లీ పేరంటాలకీ, జబ్బుతో మంచాన పడిన నీ మాతృమూర్తి మందూ మాకులకీ ఎంత డబ్బు కావాలో నీకు తెలియంది కాదు. ఏదైనా ఉద్యోగం చేసుకుని నీ కాళ్లమీద నిలబడు" అన్నాడు.


పై చదువులు చదువుకుందామనుకున్న కామేశ్వరరావు ఆశలన్నీ నిరాశలైపోయాయి. తండ్రిని ఎదిరించే సాహసం లేక ఓ బట్టల దుకాణంలో నెలకి ఏభైరూపాయల జీతానికి చేరాడు. ఉద్యోగం చేస్తూనే ప్రైవేటుగా ఇంటర్ పరీక్ష పాసయ్యాడు కామేశ్వరరావు. అప్పటికి అతనికి పద్దెనిమిది సంవత్సరాలు నిండాయి. కలెక్టర్ ఆఫీసులో గుమస్తా ఉద్యోగాలు ఖాళీగా వున్నాయని ఒకరోజు తన మిత్రుడు వచ్చి చెబితే వెంటనే వెళ్లి దరఖాస్తు పెట్టుకున్నాడు. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అవడం, ఉద్యోగంలో చేరడం వెంట వెంటనే జరిగిపోయాయి. ఒక పక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ప్రైవేటుగా బి.ఎ, ఆ తరువాత ఎం.ఎ పరీక్షలు పాసయ్యాడు. అంచెలంచెలుగా ఎదిగి డిప్యూటీ కలెక్టర్‌గా రిటైర్ అయ్యాడు కామేశ్వరరావు.

"మాస్టారూ! మీరు మా వృద్ధాశ్రమంలో చేరాలనుకుంటున్నందుకు చాలా సంతోషం. మీకు పిల్లలెంతమంది? వాళ్లేం చేస్తుంటారు? దయచేసి అన్నీ వివరంగా చెప్పండి" అన్నాడు ఆ వృద్ధాశ్రమ నిర్వాహకుడు కామేశ్వరరావుతో.

"నాకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్దవాడు ఢిల్లీలో ఓ కంపెనీలో పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడు. చిన్నవాడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో వున్నాడు. కూతురుకి పెళ్లి చేశాము" చెప్పాడు కామేశ్వరరావు.

రెండు నిమిషాలపాటు ఆయన చెప్పింది విన్న ఆ వృద్ధాశ్రమ నిర్వాహకుడు "మాస్టారూ! మీరు ఏమీ అనుకోనంటే మిమ్మల్ని ఓ విషయం అడుగుతాను."

ఏమిటో అడగండి అన్నట్టు ఆ నిర్వాహకుడి వంక



చూసాడు కామేశ్వరరావు.

"మీరు మీ శేషజీవితాన్ని మీ కొడుకుల దగ్గర హాయిగా ఆనందంగా గడపకుండా ఈ వృద్ధాశ్రమాన్ని ఎందుకు ఆశ్రయిస్తున్నారు?"

కొన్ని క్షణాలు మౌనంగా వున్న తరువాత కామేశ్వరరావు అన్నాడు. "పదిహేను సంవత్సరాలుగా ఢిల్లీలో వుంటున్న నా పెద్దకొడుకు కానీ, పది సంవత్సరాలుగా అమెరికాలో వుంటున్న నా చిన్నకొడుకు కానీ ఏనాడూ మా బాగోగుల గురించి అడిగి తెలుసుకోలేదు. అసలు మేం బ్రతికున్నామో, చచ్చామో కూడా వాళ్లకి అక్కర్లేదు. ఓ ఏడాది క్రితం అనుకుంటాను, నా పెద్దకొడుకు నాకు ఓ ఉత్తరం రాసాడు. 'నాన్నా! మొన్నీ మధ్య నా పెద్దకూతురు పెళ్లి చేసాను. అనుకోకుండా అమెరికా సంబంధం రావడం వల్ల పెళ్లి హడావిడిగా జరిగిపోయింది. మీకు శుభలేఖ పంపే టైం కూడా లేకపోయింది. అయినా ఈ వయసులో మీరు ఇంతదూరం ప్రయాణం చేయలేరని నాకు తెలుసు. ఉంటాను' అంటూ రెండు వాక్యాల్లో ఉత్తరం ముగించాడు. మా క్షేమ సమాచారాల గురించి ఎక్కడైనా ప్రస్తావించాడేమోనని ఉత్తరాన్ని ఒకటికి పదిసార్లు చదివాను. లాభం లేకపోయింది. నేనూ, నా భార్య చేసేది లేక కంటతడి పెట్టుకున్నాం.

చిన్నవాడు మాకు ఉత్తరాలు రాయడం ఏనాడో మానేసాడు. నేనే ఉండబట్టలేక వాడిమీద వున్న ప్రేమతో వారానికి ఒకటి రెండుసార్లు ఫోను చేసేవాడిని. నా సంపాదనంతా కొడుకుల చదువులకీ, నా కూతురు పెళ్లికీ, మా నాన్నగారు చేసిన అప్పులు తీర్చడానికే సరిపోయింది. నా కష్టార్జితంతో నాకంటూ ఒక గూడు ఏర్పరచుకోలేకపోయాను. ఈ వృద్ధాప్యంలో నా కొడుకులు మాకు ఆసరాగా వుంటారన్న నమ్మకం, ఆశ ఏనాడో వదిలేసుకున్నాము. ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని ఈ వయసులో మాకు ఓ అసరా కావాలి. పిలిస్తే పలికే నాథుడు కావాలి. రోగం వచ్చినా, ప్రాణం పోయినా మోసుకువెళ్లే మనిషి కావాలి. అందుకే నేనూ, నా భార్య బాగా ఆలోచించి మీ ఆశ్రమంలో చేరడానికే నిశ్చయించుకున్నాం" అంటూ కళ్లద్దాలు తీసి జేబురుమాలుతో కన్నీళ్లు తుడుచుకున్నాడు కామేశ్వరరావు.

"మాస్టారూ! మిమ్మల్ని బాధ పెట్టినందుకు నన్ను క్షమించండి. దీన్ని మీ సొంత ఇల్లులా భావించండి. ఇక్కడ మీకు కావలసిన అన్ని వసతులూ వున్నాయి.

మీలాంటివారికి ఎలాంటి నియమాలూ నిబంధనలూ వర్తించవు. నిండా నూరేళ్లూ ఇక్కడ హాయిగా, ఆనందంగా ప్రశాంతమైన జీవితాన్ని అనుభవించండి. మేమంతా మీకు ఆసరాగా వుంటాం" అంటూ కుర్చీ లోంచి లేచి కామేశ్వరరావు చేతులు పట్టుకుని నమస్కరించాడు ఆ వృద్ధాశ్రమ నిర్వాహకుడు.

-బి.శ్రీనివాసరావు(హైదరాబాద్)

ooo

# ఆత్మహత్య

ఆ ఎత్తయిన కొండ మీద నుంచి కిందికి చూశాడు ఆనంద్.

'అక్కడ్నుంచి దూకితే తను చావడం గ్యారంటీ' అని మనసులో అనుకుని దూకబోయాడు. మరుక్షణం ఎవరిదో ఒక చెయ్యి ఆనంద్ భుజం మీద పడింది. వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ అరవై సంవత్సరాల వయస్సు వున్న ఓ పెద్దాయన వున్నాడు.

"ఏంటి నువ్వు చేస్తున్న పాడు పని. ఎవరు నువ్వు? ఏం కష్టమొచ్చిందని ఈ దారుణానికి పూనుకున్నావ్?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు. కానీ ఆనంద్ చెప్పే సమాధానం కోసం చూడకుండా తనే మళ్ళీ మట్లాడటం మొదలుపెట్టాడా పెద్దాయన.

"నువ్వు చచ్చి ఏం సాధిస్తావ్? ఏదైనా సమస్యలొస్తే వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. ఫెయిల్యూర్స్‌కి కుంగిపోవటం వివేకవంతుల లక్షణం కాదు. అపజయాల్ని భూతద్దంలో చూసి, ఉన్నవీ లేనివీ ఊహించుకోకూడదు. అపజయాలను విజయాలకు సోపానాలుగా మలచుకునేవాడే తెలివైనవాడు" అని ఓ క్షణమాగి "చెప్పు... ఏంటి నీకొచ్చిన సమస్య?" అడిగాడు ఆ పెద్దాయన. ఆనంద్ చెప్పేలోగా మళ్ళీ తనే మాట్లాడడం మొదలుపెట్టాడు.


"గెలుపు జీవితానికి తుది మెట్టు కాదు. గెలుపు ఓటమిలతో కూడిన మన జీవితం ఒక నిరంతర ప్రయాణం. చాలామంది నీలాగే ఒకసారి ఓటమి ఎదురుకాగానే షాక్ తింటారు. 'ఇక మన పని అయిపోయింది. ఇక చేయగలిగింది ఏమీలేదు. చావు ఒక్కటే శరణ్యం' అని డీలా పడిపోతారు. ఇది కరక్ట్ కాదు. నీలాంటివాళ్ళు గుర్తించాల్సిన విషయం ఏంటంటే లక్ష్యసాధన మార్గంలో కొన్ని ఓటమిలను రుచి చూడాల్సిరావటం ఎవరికైనా సహజం, తప్పనిసరి! అందుకు మనం సిద్ధంగా వుండాలి. గెలుపు మార్గంలో ఓటమి ఒక మజిలీ లాంటిది. విరామం తీసుకోటానికి పనికివచ్చే మజిలీ అది. ఆ మజిలీకి చేరుకున్నాక జరిగినదానిని ఒకసారి పునస్సమీక్షించుకోవాలి. ఎక్కడ పొరపాటు జరిగింది, ఏ కారణం వల్ల జరిగింది, సరిదిద్దుకోటానికి మనం ఏం చెయ్యాలి అని ఆలోచించాలి. అంతేగానీ పిరికివాడిలా పారిపోయి వచ్చి ఆత్మహత్య చేసుకోకూడదు."

ఆనంద్ ఏదో చెప్పబోతుంటే అడ్డుతగిలి మళ్ళీ తనే చెప్పసాగాడు ఆ పెద్దాయన. "సమస్యలనేవి నీ ఒక్కడికే ఉన్నాయనుకుంటున్నావ్! అది చాలా పొరపాటు. నీకూ నాకూ వున్నట్లే సమస్యలనేవి ముఖేష్ అంబానీకీ వుంటాయి, అమితాబ్ బచ్చన్‌కీ, మైకేల్ జాక్సన్‌కీ, చివరికి బిల్‌గేట్స్‌కూ వుంటాయి. కాకపోతే వాళ్ల సమస్యలు వేల కోట్లల్లో వుంటే, మనలాంటి మధ్యతరగతి వాళ్ల సమస్యలు వేల రూపాయలతో ముడిపడి వుంటాయి... అంతే తేడా!

"చెప్పు! ఇంతకీ ఏంటి నీ ప్రాబ్లం? నిన్నీ ఆత్మహత్యకు పురిగొల్పిన ఆ సమస్య ఏంటో చెప్పు... తర్వాత నాకున్న సమస్యలు, నేను పడిన కష్టాలు, నేను అనుభవించిన అవమానాలు చెబుతా! అప్పుడు నా సమస్యల ముందు నీ సమస్య ఎంత చిన్నగా వుంటుందో నువ్వే ఆశ్చర్యపోతావ్... ఏదీ, నీ సమస్య ఏంటో చెప్పు."

"మా ఆవిడ..." అని ఆనంద్ చెప్పబోయాడు.

"అర్థమైంది... ఆమె ఎవరితోనో వెళ్ళిపోయింది. ఆ అవమానం భరించలేక నువ్వీపని చేస్తున్నావ్ కదూ?"



మన పుట్టుక మన ప్రమేయం లేకుండా ఎలా జరుగుతుందో, మన చావూ అంతే! అర్థాంతరంగా దాన్ని ముగించుకునే హక్కు మనకు లేదు. చచ్చేవరకు బ్రతకాలి. ఈ ఆత్మహత్య అనేది ఏ చెట్టూ చేయదు. ఏ జంతువు చేయదు. కానీ తెలివితేటలు వున్న మనిషే ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నాడు" అని ఈ విధంగా చెబుతూనే వున్నాడు ఆ పెద్దాయన.

కాస్సేపు సైకలాజికల్‌గా చెబితే, ఇంకాసేపు ఆధ్యాత్మికంగా, కొంతసేపు ఆవేశంగా, మరికొంతసేపు సౌమ్యంగా, కన్విన్స్ చేస్తూ లాజిగ్గా ఇలా ఎన్నోవిధాలుగా దాదాపు మూడుగంటల పాటు 'ఆత్మహత్య' ఎందుకు చేసుకోకూడదో వివరించాడు ఆ పెద్దాయన. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వనందున ఓపిగ్గా వింటూ వుండిపోయాడు ఆనంద్. ఎలాగైతేనేం చివరికి అవకాశం ఇచ్చాడు.

"కాదండీ"

"ఆమె ఈమధ్య చనిపోయింది. ఆ బాధను తట్టుకోలేక..."

"అదేం కాదు సార్" మధ్యలో ఆనంద్ అడ్డు తగిలాడు.

"మరేంటో చెప్పు!" అన్నాడా పెద్దాయన ఎంతో కూరియాసిటీగా.

"మా ఆవిడ పరమ గయ్యాళి..." అని ఇంకా ఏదో చెప్పబోతుంటే 'ఆపు' అన్నట్లు చెయ్యి అడ్డుపెట్టాడా పెద్దాయన. అతి కష్టం మీద "సారీ...!" అనగలిగాడు. ఇంకేం మాట్లాడటానికీ ఆయన నోరు పెగలలేదు. మరుక్షణం, ఆ ఇద్దరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్లిపోయారు.

-మురికినాటి గాంధీ(హైదరాబాద్)

o